**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది : 10.05.2024 సమయం : 1310 గంటలు**

**ముఖ్యాంశాలు**

**1.ఈ నెల 13న నాలుగో విడూత లోక్ సభ ఎన్నికలు జరిగే తెలుగు రాష్ట్రాల్లో ప్రచార ఘట్టం కీలకదశకు చేరుకుంది.**

**2. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఈ రోజు తెలంగాణలో తుది విడత ప్రచారం నిర్వహిస్తున్నారు. బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖర్ రావు ఈ రాత్రి సిద్ధిపేటలో బస్సుయాత్రను ముగిస్తారు.**

**3. ఎన్నికల నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు రేపు సాయంత్రం నుంచి 14వ తేదీ ఉదయం వరకు పలు ఆంక్షలు విధించారు.**

**4. ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది.**

**లీడ్ ప్రచారం**

-తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ నెల 13న పోలింగ్ జరగనున్న నాల్గవ విడత లోక్ సభ ఎన్నికల ప్రచార ఘట్టం కీలక దశకు చేరుకుంది. రెండు రాష్ట్రాలలో

ఎన్నికల ప్రచార గడువు రేపు సాయంత్రంతో ముగుస్తుంది. తెలంగాణలో ప్రధాన పార్టీలు బిజెపి, కాంగ్రెస్, బిఆర్ఎస్ తమ ప్రచారాన్ని మరింత ఉధృతం చేశారు. బిజెపి ప్రచారాన్ని ఘనంగా ముగించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేడు మరోసారి రాష్ట్రానికి వస్తున్నారు. ఈ మధ్యాహ్నం నారాయణపేట్ లో రోడ్ షో నిర్వహించనున్న నరేంద్రమోదీ, సాయంత్రం హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో భారీ బహిరంగ సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అటు కాంగ్రెస్ ప్రచారాన్ని ముగించడానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాష్ట్రానికి రానున్నారు. ఆయన ఈ సాయంత్రం నల్గొంట జిల్లా నకిరేకల్ లో కాంగ్రెస్ ఎన్నికల సభలో పాల్గొంటారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మక్తల్, షాద్ నగర్ తో పాటు హైదరాబాద్ గోషా మహల్ లో రోడ్ షో నిర్వహిస్తారు. బిజెపి, కాంగ్రెస్ లకు పోటీగా 16 రోజుల నుంచి బస్సు యాత్ర ద్వారా విస్తృత ప్రచారం సాగిస్తున్న బీఆర్ఎస్ అధినేత చంద్రశేఖరరావు ఈ సాయంత్రం సిరిసిల్లలో, రాత్రి సిద్దిపేటలో రోడ్ షో లో పాల్గొంటారు. ఇలా ఉండగా పోటీలో అభ్యర్థులు ఇంటింటి ప్రచారాన్ని ఉధృతం చేశారు.

--డెస్క్

ఖర్గే:

-ప్రజలను అసలు సమస్యలనుంచి పక్కదారిపట్టించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసలు ప్రయత్నిస్తున్నారని AICC అధ్యక్షులు మల్లిఖార్జున్ ఖర్గే ఆరోపించారు. హైదరాబాద్ లో విలేఖరులతో మాట్లాడుతూ..జనగణన విషయంలో బీజేపీ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆయన అన్నారు. కేంద్రంలో బీజేపీ

ప్రభుత్వం బీజేపీ ప్రజలకిచ్చిన హామీలేవి నెరవేరలేదన్నారు. తమకూటమి అధికారంలో వస్తే ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తామని, మహిళలకు సగం రిజర్వేషన్ తో యువత ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని చెప్పారు. బలహీనవర్గాలకు న్యాయం చేయడానికి దేశ వ్యాప్తంగా సెన్సస్ చేపడతామని పునరుద్ఘాటించారు. ఏఐసీసీ ఇంఛార్జీ దీపాదాస్ మున్షి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా మీడియా సమావేశంలో పాల్గొన్నారు.

--ఎం.ఎస్.ఎల్

**పోలీస్ ఆంక్షలు**

ఈనెల 13న లోక్ సభ ఎన్నికల నేపధ్యంలో హైదరాబాద్ లో పోలీసులు పలు ఆంక్షలు విధించారు. రేపు సాయంత్రం 6 గంటల నుంచి 14వ తేది ఉదయం 6 గంటల వరకు ఆంక్షలు అమలులో ఉంటాయి. పోలింగ్ స్టేషన్ పరిధిలో ఐదురుగురు అంతకుమించి గూమిగూడవద్దని పోలీసులు స్పష్టం చేశారు. ఎలాంటి అనుముతులతో నిమిత్తం లేకుండా మద్యం విక్రయాలపై నిషేధం ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద రెండు కంటే ఎక్కువ లైన్లు ఉండరాదని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో శామియానాలు, పందిళ్లు తాత్కాలిక నిర్మాణాలకు అనుమతి లేదని, విద్వేశాలు రెచ్చగొట్టే ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించరాదని పోలీస్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలకు కిలో మీటర్ దూరంలో కర్రలతో కూడిన జెండాలు, తుపాకాలు, మారణాయుధాలతో సంచరించరాదని తెలిపారు. రేపు సాయంత్ర నుంచి సోమవారం సాయంత్రం వరకు అన్ని రకాల ప్రచార

కార్యక్రమాలపై నిషేధం అమలులో ఉంటుంది. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాలకు రెండు వందల మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

--డెస్క్

నిజామాబాద్ ప్రొఫైల్

-రాష్ట్రంలో జనాభాపరంగా 3వ అతిపెద్ద నగరంగా గుర్తింపు పొందిన నిజామాబాద్ కేంద్రంగా ఉన్న  లోక్ సభ స్థానాల్లో ప్రస్తుత పోటీ ఆసక్తిరేపుతోంది. మూడు ప్రధాన పార్టీలు బీజేపీ, కాంగ్రెస్,  బీఆర్ఎస్ ఈ స్థానాన్ని గెల్చుకోవడనికి సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. మా విలేఖరి మహాదేవ్ అందిస్తున్న వివరాలు

--బైట్

కామారెడ్డి

-_పోలింగ్ కు రెండు రోజుల ముందు తీసుకోవలసిన జాగ్రత్తలపై కామారెడ్డి జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఎన్నికల అధికారులకు, ఇతర శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రచార గడువు ముగిసిన తర్వాత ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని, ఇతర ప్రాంతాల వ్యక్తులు జిల్లా వదిలి వెళ్లాలని స్పష్టం చేశారు. జిల్లా సరిహద్దు చెక్ పోస్టుల వద్ద, అంతరాష్ట్ర చెక్ పోస్టుల వద్ద డబ్బు, మద్యం రవాణాపై గట్టి నిఘా పెట్టాలని సూచించారు.

--పీటీసీ, కామారెడ్డి

వరంగల్

-లోక్ సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఆర్టీసీ బస్ స్టేషన్ ప్రాంగణాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్ లో ప్రయాణికుల చేత ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ పి.ప్రావీణ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

--పీటీసీ, వరంగల్

కవిత

-ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్ పై ఢిల్లీ హైకోర్టు విచారణను వాయిదా వేసింది. బెయిల్ పిటిషన్ పై వాదనలకు ఈడీ సమయం కోరడంతో విచారణను ఈ నెల 24వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు న్యాయస్థానం తెలిపింది.

--డెస్క్

**వర్షాలు**

-రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఈదురుగాలులకు పలు జిల్లాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. మరో మూడు రోజుల పాటు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని, కొన్ని చోట్ల గంటకు 40 నుంచి 50 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ కేంద్రం తెలిపింది. ఈనెల 13వ తేది తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు పెరగవచ్చని పేర్కొంది.

--డెస్క్

**మామిడి నష్టం**

-అకాల వర్షాల వల్ల ఉమ్మడి నల్గొండ జిల్లాలో మామిడి తోటలకు నష్టం వాటిల్లింది. సూర్యాపేట జిల్లాలోని కోదాడ, హుజుర్ నగర్, సూర్యాపేట్, తుంగతుర్తి, నల్గొండ జిల్లాలోని నల్గొండ, మల్లేపల్లి, దేవరకొండ, కనగల్, పెద్ద ఊర ప్రాంతాల్లో గాలి దుమారానికి మామిడికాయలు నేలరాయాయి. 15 వందల ఎకరాల్లో మామిడికి నష్టం జరిగినట్లు ఉద్యానవన శాఖ అధికారులకు ప్రాధమికంగా అంచనా వేశారు.

--డెస్క్

**ఎయిర్ ఇండియా**

-ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ సిబ్బంది రెండు రోజుల ఆందోళన విరమించారు. తక్కువ వేతనాలు, మొదలైన సమస్యలపై దాదాపు 3 వందల మంది సిబ్బంది ఆకస్మాత్తుగా సామూహిక అనారోగ్య సెలవులు పెట్టడంతో విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. దీంతో 25 మంది సిబ్బందిని తొలగిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. అలాగే వెంటనే ఆందోళన విరమించకపోతే మిగిలిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ నేపధ్యంలో జరిగిన చర్చల్లో కుదిరిన అంగీకారం మేరకు ఆందోళన విరమించేందు సిబ్బంది అంగీకరించారు. దీంతో 25 మంది సిబ్బందిని తొలగించడాన్ని ఉపసంహరించుకున్నట్లు యాజమాన్యం తెలిపింది.

--డెస్క్

**సింహాచలం**

-ఆంధ్రప్రదేశ్ లోని సింహాచలం వరహా లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈరోజు చందనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఒంటి గంటకు సుప్రభాత సేవతో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి దేహంపై ఉన్న చందనాన్ని తొలగించి భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక గజపతి రాజు తొలి దర్శనం చేసుకున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా సమీప ప్రాంతాల నుంచి వేలాది భక్తులు సింహాచలం తరలివచ్చారు.

--డెస్క్

**ఏకలవ్య**

-ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కో ఆర్డినేటర్ డిఎస్ వెంకన్న తెలిపారు. సిబిఎస్ఈ సిలబస్ తో ఎంపిసి, బైపిసి, సీఈసి గ్రూపుల్లో ప్రవేశానికి పదవ తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మరిమడ్లలో బాలురకు, ఎల్లారెడ్డిపేటలో బాలికలకు ప్రవేశం కల్పిస్తామని చెప్పారు.

--పిటిసి, రాజన్న సిరిసిల్ల

**అటవీ అధికారులపై గ్రామస్తుల దాడి**

-ఆసిఫాబాద్ జిల్లా తుంగెడ గ్రామ సమీపంలో పోడుభూముల కోసం అటవీ అధికారులకు గ్రామస్థుల మధ్య జరిగిన ఘర్షణలో ఐదురుగురు అటవీ అధికారులు స్వల్పంగా గాయపడ్డారు. కొందరు గ్రామస్థులు పోడు చేసేందుకు ప్రయత్నం చేస్తుండగా అధికారులు వారిని అడ్డుకున్నారని దాంతో ఘర్షణ జరిగిందని జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ తెలిపారు.

--పిటిసి, ఆసిఫాబాద్

**పురుగు మందు**

-టి స్పేన్స్ కంపెనీకి చెందిన ట్రైకోడెర్మా విరిడి 1.50 శాతం లిక్విడ్ ఫార్మ్ లేషన్ క్రిమిసంహారక మందును నిషేధించినట్లు తెలంగాణ వ్యవసాయ ప్రకటించింది. ప్రయోగ పరీక్షల్లో ఈ మందు నాశిరకం అని తేలినట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి గోపి తెలిపారు. ఈ మందును నిల్వ చేయొద్దని, విక్రయించవద్దని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. అలాగే ఈ పురుగు మందును కొనవద్దని రైతులను కోరారు.

--డెస్క్

**ట్రాఫిక్**

-హైదరాబాద్ లో ఎల్బీ స్టేడియంలో ఈ సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎన్నికల బహిరంగ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారు. ఎల్బీ స్టేడియం పరిసరాల్లో సాయంత్రం 4 గంటల నుంచి 8

గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని పోలీసులు సూచించారు.

--డెస్క్

**పోస్టల్ బ్యాలెట్**

రాష్ట్రంలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ దాదాపు ముగిసిందని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ సాయంత్రం వరకు గడువు ఉండగా, ఇంత వరకు కేంద్ర సర్వీసుల్లో విధి నిర్వహణలోని ఉద్యోగులు మినహా, మిగిలిన క్యాటగిరిల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ఇంచుమించుగా ముగిసిందని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల విధుల్లోని ఉద్యోగుల్లో పోస్టల్ బ్యాలెట్ కోసం 2 లక్షల 64 వేల 43 మంది దరఖాస్తు చేయగా, ఇప్పటి వరకు ఒక లక్షా 75 వేల 994 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే 80 ఏళ్లు వృద్ధులు, దివ్యాంగుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన హోం ఓటింగ్ కేటగిరిలో 21 వేల 651 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల సంఘం తెలిపింది.

--డెస్క్

బండి సంజయ్

-తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం పది లక్షల కోట్ల రూపాయలకు పైగా నిధులు ఇచ్చిందని, దీనిపై బీఆర్ఎస్  బహిరంగ చర్చకు వస్తే పవర్ పాయింట్ ప్రజేంటేషన్ తో ఆధారాలు చూపిస్తామని కరీంనగర్ బీజేపీ ఎం.పి అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. ఈ రోజు సిరిసిల్లలో విలేఖరులతో మాట్లాడుతూ..కరీంనగర్ లో తాను

ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తాననీ, బీఆర్ ఎస్  అభ్యర్థి వినోద్ కుమార్ ఇందుకు సిద్ధమేననీ బండి సంజయ్ ప్రశ్నించారు. తమను ఓడించాలని చంద్రశేఖర్ రావు ముస్లింలకు పిలుపునివ్వడం, హిందువులను కించపర్చడమేనని ఆయన అన్నారు. కేసీఆర్ ను ఎమోషనల్ బ్లాక్ మెయిలర్ గా బండి సంజయ్ అభివర్ణించారు.

--పీటీసీ, రాజన్న సిరిసిల్ల

**టిఎస్ ఆర్టీసి**

-పోలింగ్ తేది సమీపిస్తుండడంతో హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరిగింది. ఆంధ్రప్రదేశ్ కు ఇప్పటికే ప్రకటించిన బస్సుల్లో సీట్లన్ని నిండిపోవడంతో టిఎస్ ఆర్టీసి మరో 160 అదనపు సర్వీసులను అందుబాటులోకి తెచ్చింది. అలాగే తెలంగాణలోని వివిధ జిల్లాలకు వెయ్యికి పైగా బస్సులను సిద్దం చేసింది. ఈరోజు నుంచి మూడు రోజుల పాటు మొత్తం 14 వందల సర్వీసులు అందుబాటులో ఉంటాయని సంస్థ తెలిపింది. హైదారాబాద్ లో ఎంజిబిఎస్, జెబిఎస్ లతో పాటు ఆరాంఘర్, ఉప్పల్, ఎల్బీ నగర్ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు బయలుదేరతాయి. అలాగే పోలింగ్ తర్వాత 13, 14 తేదిల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి హైదారాబాద్ కు తిరిగి వచ్చేందుకు కూడా బస్సులను సిద్దం చేసినట్లు టీఎస్ ఆర్టీసీ తెలిపింది.

--డెస్క్

**<u>రైళ్లు</u>**

-మరోవైపు రైల్వే కూడా ఎన్నికల సందర్భంగా ప్రత్యేక రైళ్ల ఏర్పాటుతో పాటు 22 రైళ్లలో అదనపు బోగీలు ఏర్పాటు చేస్తోంది. ఈరోజు నుంచి 13వ తేది వరకు కొన్ని రైళ్లు, 11వ తేది నుంచి 14వ తేది వరకు మరికొన్ని రైళ్లు అదనపు బోగీలతో నడుస్తాయి. సికింద్రాబాద్ – విశాఖ, కాచిగూడ – గుంటూరు, వికారాబాద్ – గుంటూరు, విశాఖ – గుంటూరు, సికింద్రాబాద్ – విజయవాడ సహా పలు రూట్లలో రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

--డెస్క్